ప్రజా విశ్వంభర
V3 NEWS

# 21 వ శతాబ్దంలో కూడా ఆగని వరకట్న వేధింపులు




ఒక దేశం నిజంగా అభివృద్ధి చెందిందా లేదా అన్నది దాని ఆర్థిక ప్రగతితో కాక, ఆ దేశ మహిళలు ఎంత భద్రంగా, గౌరవంగా జీవిస్తున్నారనే అంశంతో కొలవాలి. కానీ నేటి భారతదేశంలో కట్నం పేరుతో మహిళలపై జరుగుతున్న వేధింపులు, హత్యలు, ఆత్మహత్యలు, మానసిక హింస చూస్తుంటే సమాజం ఇంకా ఎలాంటి చీకటి సంప్రదాయాల బంధనంలో చిక్కుకుపోయిందో అర్థమవుతోంది. చట్టాలు కఠినంగా ఉన్నప్పటికీ కట్నం అనే సామాజిక రుగ్మత కొత్త రూపాల్లో కొనసాగుతుండటం ఆందోళన కలిగించే విషయం.తాజా నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలు పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. 2023లో దేశవ్యాప్తంగా కట్న నిరోధక చట్టం కింద 15,489 కేసులు నమోదయ్యాయి. ఇది 2022తో పోలిస్తే దాదాపు 14 శాతం పెరుగుదల. అదే ఏడాది 6,156 మంది మహిళలు కట్న మరణాలకు బలయ్యారు. అంటే రోజుకు సగటున 16 మందికిపైగా మహిళలు కట్న వేధింపుల కారణంగా ప్రాణాలు కోల్పోయినట్టే.

అలాగే కట్నమే కారణంగా 833 హత్యలు నమోదయ్యాయి.ఇటీవల వెలుగులోకి వచ్చిన ఘటనలు ఈ సమస్య ఇంకా ఎంత లోతుగా పాతుకుపోయిందో చూపిస్తున్నాయి. ఉత్తంప్రదేశ్‌లోని ఘాజియాబాద్‌లో వివాహం జరిగిన కొద్ది నెలలకే రూ.30 లక్షలు, విలాసవంతమైన వాహనం కోసం వేధింపులకు గురైన ఓ యువతి అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించింది. మరో ఘటనలో కట్న డిమాండ్లు నెరవేర్చలేదనే కారణంతో యువతి మృతిచెందిన కేసు నమోదైంది. ఇవి దేశవ్యాప్తంగా వార్తల్లోకి వచ్చిన కొన్ని సంఘటనలు మాత్రమే; నమోదు కాని, వెలుగులోకి రాని ఘటనలు ఇంకా ఎన్నో ఉండవచ్చనే వాస్తవం మరింత భయానకంగా ఉంది.ఇంకా విచారకరమైన విషయం ఏమిటంటే, నేడు మహిళలు విద్యలో, ఉద్యోగాలలో, వ్యాపారాలలో పురుషులతో సమానంగా లేదా కొన్ని రంగాల్లో వారిని మించిపోయి ముందుకు వెళ్తున్నారు. లక్షలాది మంది మహిళలు స్వయంగా సంపాదిస్తూ కుటుంబ పోషణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. చాలామంది కుటుంబాల్లో మహిళల ఆదాయమే ప్రధాన ఆధారం కూడా అవుతోంది. అయినప్పటికీ అదే మహిళలు కట్నం కోసం వేధింపులకు గురవుతుండటం సమాజంలోని ద్వంద్వ వైఖరిని బయటపెడుతోంది. ఒకవైపు వారి జీతాలు, పొదుపులు, ఆర్థిక సహకారాన్ని స్వీకరిస్తూ, మరోవైపు అదనపు నగదు, కారు, ఆస్తి లేదా ఖరీదైన బహుమతులు తీసుకురావాలని ఒత్తిడి చేయడం దురాశకు పరాకాష్ఠ. విద్య, ఉద్యోగం, ఆర్థిక స్వావలంబన మహిళలకు గౌరవప్రదమైన స్థానం తీసుకురావాల్సి ఉండగా, వారిని ఇప్పటికీ ఆర్థిక లాభాల సాధనాలుగా చూడడం సమాజ వైఫల్యమే.కట్నం సమస్య కేవలం చట్టపరమైనది కాదు. ఇది మహిళను వ్యక్తిగా కాక, వస్తువుగా చూసే మనస్తత్వానికి ప్రతీక. "గిఫ్ట్", "సహాయం", "సెటిల్‌మెంట్", "వెడ్డింగ్ సపోర్ట్" వంటి కొత్త పేర్లతో కట్న సంస్కృతిని కొనసాగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. విద్యావంతులు, ఉన్నత ఉద్యోగులు, సంపన్న కుటుంబాలు కూడా ఈ దురాచారం నుంచి పూర్తిగా దూరం కాలేకపోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది.ఈ సమస్యకు చట్టాలు మాత్రమే పరిష్కారం కావు. సామాజిక విలువలు మారాలి. కట్నం తీసుకోవడం ప్రతిష్ఠగా భావించే ధోరణి అంతరించాలి. యువత స్వయంగా కట్నాన్ని తిరస్కరించాలి. కుటుంబాలు కుమారుడి వివాహాన్ని సంపాదన అవకాశంగా కాక, రెండు జీవితాల కలయికగా చూడాలి.మహిళ సంపాదనను స్వీకరించి, అదే మహిళ నుంచి కట్నాన్ని కూడా ఆశించడం ఆధునిక దుస్తులు ధరించిన పాత సామాజిక దురాచారమే. మహిళను దేవతగా పూజిస్తామని చెప్పుకునే సమాజం ఆమె గౌరవానికి ధర నిర్ణయించే స్థాయికి దిగజారితే అది పురోగతి కాదు, పరాజయం. కట్నం అడిగే ప్రతి చేయి నేరానికి ప్రతీకగా, కట్నాన్ని నిరాకరించే ప్రతి స్వరం సామాజిక సంస్కరణకు నాందిగా మారినప్పుడే మహిళలపై ఈ చరిత్రాత్మక అన్యాయానికి ముగింపు పలకగలుగుతాం.

-హెచ్.ప్రతాప్

# వినాశకాలే విపరీత బుద్ధిః

**"వినాశకాలే విపరీత బుద్ధిః "అన్నది సంస్కృతం లో ప్రసిద్ధి చెందిన ఒక సూక్తి. ఒక వ్యక్తికి లేదా వ్యవస్థకు నాశనం ఏర్పడినప్పుడు, వారి ఆలోచనలు ,నిర్ణయాలు వినాశనానికి దారి తీసే విధంగా మారుతాయని దీని అర్థం.ఈ సామెత మానవ నైజానికి ,అహంకారానికి అద్దం పడుతుంది. మనిషి జీవితంలో ఎప్పుడైనా సరే, వివేకం కోల్పోయి అధర్మ మార్గంలో పయనిం చడం ప్రారంభించినప్పుడు, అతని పతనం నిర్ధారణ అవుతుంది. కాలం కలిసి రానప్పుడు ఎంతటి పండితుడైనా , బలశాలి అయినా సరే తప్పుడు నిర్ణయాలు తీసుకుంటాడనిమన చరిత్ర లు, పురాణాలు స్పష్టం చేస్తున్నాయి.**

అప్పుడే కాదు .ఇప్పటి ఆధునిక సమా జంలో కూడా నిత్యజీవితంలోఇలాంటి ఉదాహరణలు ఎన్నెన్నో. మనకు ధర్మానికి హిందూ ఇతిహాసాలు ప్రామా ణికాలు. రామాయణ మహాభారతాలలో ఈ సూక్తిలేదా సామెతకు ఖచ్చితమైన ఉదాహరణలు ఉన్నాయి .వేద వేదాంగాలుచదివిన రావణాసు రుడు గొప్ప శివ భక్తుడు, మహాబలశాలి .కానీ అతనికి నాశనం దగ్గర పడినప్పుడు సీతా పహ రణం అనే తప్పుడు నిర్ణయం తీసుకున్నాడు. తమ్ముడైన విభీషణుడు, భార్య మండోదరి ఎంతగా హితవు చెప్పినా వినలేదు అతని బుద్ధి విపరీతంగా మారడం వల్లనే లంకతో పాటు అతను వంశం మొత్తం సర్వనాశనమైంది. అలాగే దుర్యోధనుడు. శ్రీకృష్ణుడు స్వయంగా రాయబారిగా వచ్చి ,పాండవులకు ఐదు ఊర్లు ఇస్తే చాలు యుద్ధం వద్దు అని శాంతి వచనాలు పలికినా, దుర్యోధనుడు అహంకారంతో సూది మొన మోపినంత భూమి కూడా ఇవ్వనని భీష్మించుకు కూర్చున్నాడు. ఆ విపరీత బుద్ధి కురువంశ నాశనానికి, కురుక్షేత్ర యుద్ధానికి దారితీసింది.తరువాతి కాలంలో చారిత్రక ఆధారాలను పరిశీలిస్తే అడాల్ఫ్ హిట్లర్ ప్రపంచం మొత్తాన్ని జయించాలి, నియంతగా తానే శాసించాలి అనే అహంకారంతో ఒకే సమయంలో రష్యా తో పాటు అనేక యుద్ధాలు ప్రకటించి, తన సామ్రాజ్యాన్ని నాశనం చేసుకున్నాడు. అతనే కాదు కొందరు రోమన్ చక్రవర్తులు ,ఫ్రెంచ్ విప్లవం నాటి పాలకులు కూడా ప్రజలలో చెలరేగిన తిరుగుబాటు ధోరణిని గమనించకుండా అహంకారంతో వ్యవహరించి ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనలు కేవలం పురాణాలకో, చరిత్రకో మాత్రమే పరిమితం కాలేదు. ఈ ఆధునిక కాలంలో కూడా అత్యాశ మరియు ఆర్థిక మోసాలు విపరీతంగా ప్రబలిపోయాయి. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని అత్యాశతో చాలామంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడతారు .కష్టపడి సంపాదించిన సొమ్మును షేర్ మార్కెట్ జూదాలలో ,బెట్టింగ్ యాప్ లలో ,నకిలీ స్కీములలో పెట్టి రోడ్డున పడుతున్నారు దీన్ని అంతటికి విపరీతమైన ఆశే కారణం. ఒకప్పుడు ప్రపంచాన్ని ఏలిన నోకియా, కోడక్ వంటి కంపెనీలు కాలంతో పాటు మారడానికి నిరాకరించాయి .తమకు తిరుగులేదు అనుకున్నాయి .కొత్త సాంకేతికను అందిపుచ్చుకోలేదు .మార్కెట్లో తమ పతనం ప్రారంభమైనా సరే పాత పద్ధతులకే మొండిగా అతుక్కుపోవడం వల్ల చాలా నష్టపోయారు. వెనకబడిపోయారు. మరి కొంతమంది వ్యక్తులు క్షణికావేశంలో చేసే తప్పులు లేదా మద్యం డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసపటం వల్ల వారి కుటుంబాలు రోడ్డు మీద పడ్డాయి. వారి పిల్లలు భ్రష్టచెందారు. చట్టం, సమాజం, కుటుంబం ఎంతగా హెచ్చరించినా వినకుండా ప్రవర్తించడం వల్ల ఫలితం స్పష్టంగా కళ్ళకు కట్టినట్లు తెలుస్తున్నది.మానవ సమాజం అంతా కలిసి చేస్తున్న పెద్ద తప్పు ఏమిటంటే పర్యావరణ నాశనం. గ్లోబల్ వార్మింగ్. కాలుష్యం. వీటివల్ల ఎన్ని అనర్థాలు జరుగుతున్నాయో మనం కళ్లారా చూస్తున్నాము. మానవుడు స్వార్థంతో చెట్లను నరుకుతూ ,ప్లాస్టిక్ వాడుతూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాడు. ఫలితంగా వరదలు, తుఫానుల రూపంలో ప్రకృతి మన77లను హెచ్చరిస్తూ ఉన్నది.మనిషికి సంపద అధికారం పెరిగినప్పుడు దురహంకారం పెరిగిపోతుంది. ఎదుటివారి మాటలు వారు ఎంత మంచిగా చెప్పి నా చెడ్డగానే అనిపిస్తాయి.ఈ సమస్యలకు ఒక్కటే పరిష్కారం. అదేమిటంటే పర్యావరణాన్ని కాపాడుకోవడం. మనకు కష్టాలు ఎదురైనప్పుడు శాంతంగా వివేకంతో ఆలోచించుకొని వ్యవహరించాలి. ఎవరైనా మంచి మాటలు చెప్పినప్పు డు మన అహంకారాన్ని పక్కనపెట్టి విని విచక్షణతో నడుచుకోవాలి. ఆవేశం అనర్థహేతువు. కనుక అన్నిటికీ ఆవేశపడకుండా బుద్ధిని సక్రమంగా అదుపులో ఉంచుకొని విచక్షణ తో సరైననిర్ణయాలుతీసుకున్నప్పుడుమనలను మనం కాపాడుకోగలం. వినాశనాన్ని అరికట్టగలం.



చేబ్రోలు శశిబాల
హైదరాబాద్, సెల్: 98495 07991

# సుకవి జీవించు ప్రజల నాలుకల యందు..



**కులమతాల గీసుయకున్న జొచ్చి**
**పంజరాన గట్టు వడను నేను**
**నిఖిల లోక మెట్లు నిర్ణయించిన నాకు**
**తిరుగులేదు విశ్వనరుడ నేను**

అంటూ తన విశాల హృదయాన్ని ఆవిష్కరించిన సామాజిక విప్లవ కవితామూర్తి, విశ్వనరుడు, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా. ఆధునికులైన పద్య కవులలో అగ్రశ్రేణి కవి జాషువా. భావ కవిత్వం ఉద్యమంగా సాగుతున్న రోజులలో భావ కవిత్వాన్ని కాదని సామాజిక సంస్కరణాభిలాషతో కవిత్వాన్ని రాసిన ధీశాలి.

19వ శతాబ్దం లోనే సమాజంలోని కుల వివక్షను ఎదిరించి కులాంతర వివాహం చేసుకున్న ఆదర్శ దంపతులు గుర్రం వీరయ్య – లింగమాంబ. వీరికి 1895 సెప్టెంబర్ 28 న జాషువా జన్మించారు. కులం కారణంగా అనేక అవమానాలు ఎదుర్కొన్నాడు. తన కలంతో సమాజంలోని దురాచారాలపై తిరుగుబాటు చేశాడు. వర్గ సంఘర్షణ ఆర్థిక వ్యత్యాసాల నిర్మూలన దోపిడి వర్గాల పై నిరసన జాషువా కవిత్వంలో ప్రతిబింబిస్తాయి. అంధ విశ్వాసాలను మత విద్వేషాలను తీవ్రంగా నిరసించాడు.

" ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించు గాని దుః
ఖిత మతులైన పేదల పకీరుల శూన్యములైన పాత్రలన్
మెతుకు విదల్చరీ భరత మేదిని ముప్పది మూడు కోట్ల దే
వతలెగబడ్డ దేశమున భాగ్య విహీనుల క్షుత్తులారునే

అంటూ దేశంలో ఆకలితో అలమటించే వారి కంటే విగ్రహాలకు పెళ్లిళ్లు చేయడానికే సంపద ను వెచ్చిస్తున్న సమాజ పోకడలు తీవ్రంగా ఆక్షేపించారు.

కాల్పనిక పోకడలు లేకుండా ఊహాలోకంలో విహరించకుండా వాస్తవాలను వినూత్నంగా ఆవిష్కరించిన కవి జాషువా. తన జీవితానుభవాలనేకవిత్వంగాసమాజంపై గుప్పించినవాడు. ఈయన కవిత్వంలో కరుణరసం ఉట్టిపడుతుంది. జాతీయ అభిమానం సంఘ సంస్కరణాభిలాష ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. బుద్ధుడు క్రీస్తు గాంధీల జీవ కారుణ్య భావనలు తొణికిసలాడుతాయి. నిజాయితీ ఆర్తి ఆవేశం ప్రతిఘటన జాషువా కవిత్వానికి జీవ లక్షణాలు. తనలోని ఆగ్రహజ్వాలలను అక్షరాలుగా మలచి సంస్కరణ ఉద్యమానికి అండగా నిలిచే సాహితీ సృజన చేసిన చైతన్య శీలి. ఆచార్య సినారె గారు అన్నట్లు గుర్రం జాషువా దళిత వర్గ జ్వలన్మూర్తి.

జాషువా దాదాపు 36 కావ్యాలు రాశారు. అందులో ఉత్కృష్టమైనది గబ్బిలం. ఇది ఒక సందేశ కావ్యం. కాళిదాసు మేఘసందేశం కావ్యాన్ని పోలి ఉంటుంది. కథ మాత్రం భిన్నమైనది. గబ్బిలం లో కథానాయకుడు దళితుడు. తంజావూరు దక్షిణ ప్రాంతంలో చెప్పులు కుట్టే జీవనం సాగిస్తున్న వాడు. తన ఇంటి లోకి వచ్చిన గబ్బిలానికి తన గోడు అంతా వివరించి కైలాస గిరిలో ఉన్న శివునికి తెలియజేయమని కోరుతాడు.

ఆలయమ్మున నీవు వ్రేలాడు వేళ
శివుని చెవి నీకు కొంత చేరువగ నుండు
మౌని ఖగరాజ్ఞి! పూజారిలేని వేళ
విన్నవింపుము నాదు జీవిత చరిత్ర!

బ్రాహ్మణ సమాజం దళితులను అణచివేస్తుంది అని ఆవేదన కవి వెలిబుచ్చారు. అందుకే తన భాదను పూజారి లేని వేళ లో విన్నవించమన్నాడు. దళితులకు గుడిలోకి ప్రవేశము లేదు. గబ్బిలాలకు ఆ నిబంధనలు లేవు గనుక కథానాయకుడు తన రాయబారిగా గబ్బిలాన్ని ఎంచుకున్నాడు.

గబ్బిలం హైందవ సంస్కృతి ప్రకారం కీడుకు సంకేతం. గబ్బిలం ఇంట్లోకి ప్రవేశించకూడదు అని కోరుకుంటారు. అలాగే దళితులను కూడా అంటరాని వారిగా చూస్తారు. మానవమాత్రులు అపశకునంగా భావించే గ బ్బి లం శి వా ల య ా ల లో గ ర్భ గు డి లో నివసించగలుగుతున్నది. భగవంతునికి కుల వర్ణ భేదాలు లేకుండా అందరూ సమానులే అనే భావనను ప్రతీకాత్మకంగా తెలియజేయడానికి ఏ జాషువా గబ్బిలాన్ని రాయబారిగా ఎంచుకున్నాడు. గబ్బిలం కావ్యం లో దళితుల దీనస్థితిని జాషువా వర్ణించిన తీరు హృదయాలను కలచివేస్తుంది

ఆ అభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయు!
గసరి బుసకొట్టు నాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు

చాతుర్వర్ణ వ్యవస్థను నాలుగు పడగల నాగరాజుగా అభివర్ణించాడు. దళితుడు పేదరికంలో మగ్గిపోతున్న అనడానికి అతని ఇంట్లో దరిద్ర దేవత కాపురం ఉందన్నాడు. ఈ విధంగా కుల వ్యవస్థను హెచ్చుతగ్గులు నిచ్చెనమెట్ల సమాజాన్ని వర్ణవ్యవస్థను జాషువా తీవ్రంగా నిరసించాడు.

జాషువా తన జీవితమంతా కులవివక్షను అవమానాలను అడుగడుగునా ఎదుర్కొన్నాడు. ఒకసారి వినుకొండలో జరిగిన ఒక అవధాన సభలో ఆయన పద్యాలు చదవగా అంటరాని వారిని సభ లోకి ఎందుకు అనుమతించారు అంటూ కొంతమంది అగ్రవర్ణ పండితులు సభనుండి వెళ్ళిపోవడం జాషువా మనసును తీవ్రంగా గాయపరిచింది.

జాషువా అంటరానివాడు అని హిందువుల ఈసడించుకున్నారు. క్రైస్తవుడా అయ్యుండి కూడా హైందవ సంబంధ రచనలు చేస్తున్నాడని క్రైస్తవ మత పెద్దలు కన్నెర్ర చేశారు. తన కుటుంబాన్ని క్రైస్తవ నుంచి వెలివేశారు. అయినా చెల్లించకుండా జాషువా నాస్తికుడిగా తన ప్రస్థానాన్ని కొనసాగించారు.

నా కవితావధూటి వదనంబు నెగాదిగ జూచి రూప రే
ఖా కమనీయ వైఖరులు గాంచి 'భళిభళి'! యన్నవాడె మీ
దే కులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచిపోవుచో
బాకున గ్రుమ్మినట్లగును పార్థివచంద్ర! వచింప సిగ్గగున్

అంటూ తనకు జరిగిన అవమానాలకు ఆక్రోశం వెలిబుచ్చారు. ఎక్కడ అవమానాలు జరిగాయో అక్కడే తన అసమాన ప్రతిభ సంపత్తి చేత సన్మానాలు అందుకున్నారు. గండపెండేరాలు తొడిగించుకున్నారు. పగటి దివిటీలతో మత్తగజము పై ఊరేగారు. అద్భుతమైన పద్యాన్ని పండించడానికి కులం అడ్డు రాదు అని నిరూపించారు.

జాషువా గొప్ప దేశ భక్తుడు. తన రచనల్లో దేశాభిమానాన్ని అద్భుతంగా చిత్రీకరించారు. గబ్బిలం సంఘ సంస్కరణాభిలాష తో కూడిన కావ్యమైనా అంతర్లీనంగా దేశభక్తి ప్రవహిస్తూ ఉంటుంది. భారతదేశాన్ని ఈ కావ్యంలో అత్యంత మనోహరంగా వర్ణించారు. తంజావూరు నుండి కైలాసగిరి కి వెళ్లడానికి గబ్బిలానికి మార్గనిర్దేశనం చేసే నెపంతో భారతదేశపు గొప్పదనాన్ని ఆయా ప్రాంతాల విశిష్టతలను అద్భుతంగా ఆవిష్కరించారు.

కథానాయకుడి ఇంటి నుండి బయలుదేరిన గబ్బిలం మొదట తంజావూరు నగరానికి వెళ్ళాలి అని సూచిస్తూ తంజావూర్ నగర విశిష్టతను, రఘునాథ రాయలు వైభవాన్ని జాషువా కళ్ళకు కట్టినట్లు వర్ణించారు

కొమరారు దంజనగరము
సమీపమునఁ గలదు తెలుగు సౌరభ్యంబుల్
గమ గమ వలచిన చోటది
యమరున్ రఘునాథరాజు నాస్థానంబున్

అపర శ్రీకృష్ణదేవరాయలు గా కీర్తించబడిన రఘునాథ రాయలు ఆ స్థానంలో చేమకూర వెంకటకవి, ముద్దుపళని, వంటి కవుల గురించి తెలియజేశారు. తంజావూర్ లోని సరస్వతీ మహల్ సందర్శించమని చెప్పారు.

తంజావూరు నుండి బయలుదేరిన గబ్బిలం తెలుగు ప్రాంతపు సరిహద్దు పట్టణమైన నెల్లూరు దర్శించమని తెలియజెప్పారు.

యతియుంబ్రాసయులే సంస్కృత
కవిత్వారణ్యమందున్న భా
రతవేదానఁ బదేనుపర్వముల
కాంధ్రత్వంబు నేర్పించి శా
శ్వత్నుఁడై పోయిన తిక్కయజ్వకు
నివాసంబైన నెల్లూరికిన్
నతులర్పింపుము స్నానమాడు మతి
గణ్యంబైన పెన్నానదిన్

అంటూ మహాభారతంలో పదిహేను పర్వాలను తెనుగించిన తిక్కనను దర్శించమని, పవిత్ర పెన్నానదిలో స్నానమాడుమని తెలియజేశారు. నెల్లూరు సీమ స్త్రీల పాండితీ ప్రతిభ ను శ్లాఘించారు. తదనంతరం వినుకొండ గుంటూరు సీమ లను సందర్శించమని తెలియజేస్తారు. పల్నాడులో బ్రహ్మనాయుడి చాపకూటి భోజనం, నాగమ్మ కుతంత్రాలు, బాలచంద్రుని సాహసాలను వివరిస్తాడు. కొండవీటి రెడ్డిరాజుల పౌరుషాన్ని ప్రస్తావిస్తాడు. అనంతరం గోదావరీ తీర రాజమహేంద్ర నగరాన్ని సందర్శించాలని తెలియజేస్తాడు.

రెండున్నర పర్వంబులు
పిండిన రస మొలుకునట్టి పెను
జెఱకుగడన్
బాండవుల చరిత నన్నయ
పండించెన్ దెల్గుఁగులోనఁ
బ్రజ్ఞాన్విత్నుఁడై

తెలుగులో మహాభారతానికి అంకురార్పణ చేసిన నన్నయను స్మరిస్తాడు. చిత్రాంగి వలన అపవాదును మూటగట్టుకున్న సారంగధరుని పట్ల సానుభూతిని ప్రకటిస్తాడు. తరువాత ద్రాక్షారామ భీమేశ్వరుని సందర్శించాలని గబ్బిలాన్ని కోరుతాడు. భీమేశ్వరుని మహిమను వర్ణిస్తాడు. అనంతరం విజయనగర సమీపంలోని బొబ్బిలిని సందర్శించాలని చెప్తాడు

అల బుస్సీ దొర కొల్లగొటిన యనన్యంబైన మావెల్మవీ
రుల విఖ్యాతపరాక్రమజ్వలన మూర్వుల్ జిమ్ముచున్నట్టి బొ
బ్బిలి కోట గని దాటిపొమ్ము చటులావేశంబు దేహంబునన్
మొలుచున్ బొల్చు కవోష్ణవీర రుధిరంబున్ జీవనాళంబులన్

బొబ్బిలి యుద్ధం లో తాండ్రపాపారాయుడు వంటి వీరుల పరాక్రమాన్ని తెలియజేస్తాడు. ఇలా భారతదేశంలోని అణువణువు పవిత్రమైనదే అనే భావన గబ్బిలం కావ్యం నిండా పరుచుకుంటుంది. ఆంధ్రదేశంలోని ఉత్తరాంధ్ర ప్రాంతం దాటిన తరువాత ఉత్కళ తీరాన్ని సందర్శించాలని తరువాత వింధ్య సాత్పురా పర్వతాలు ఉన్న మధ్య భారతాన్ని, అనంతరం వంగ దేశాన్ని, గంగా సింధూ మైదానం ప్రాంతాలను, కాశీ నగరాన్ని, ఆగ్రా తాజ్ మహల్ ను సందర్శించమని తెలియజేస్తాడు. అనంతరం నేను ఢిల్లీ గా పిలుస్తున్న హస్తినాపురికి వెళ్ళమని మార్గనిర్దేశనం చేస్తాడు.

ఆ ఢిల్లీపుర హస్తినాపురి సమాఖ్యన్
ద్వాపరంబన్నుఁగొం
డాడం బడ్డది ధర్మజుండచట
రాజ్యంబేలి చేయించినా
డీడ్నుఁ జోడును లేని జన్నముల నెన్నన్న
గన్నులున్నందుకున్
జూడన్ దగ్గ పురంబు సుమ్మచట వీచున్
భోగసౌరభ్యముల్

ధర్మరాజు ఏలిన హస్తిన ని చూసి, అచట నుండి బుద్ధ దేవుడు జన్మించిన బీహార్ ప్రాంతాన్ని సందర్శించి అచట నుండి హిమగిరి లో కి వెళ్ళమని తెలియజేస్తాడు. దలైలామాలుండే హిమాలయ అందాలను వర్ణిస్తాడు.

అందు నెవరెస్టు శిఖారన నధివసించి
వ్రాసికొనవచ్చు భరత వర్షంబు పటము
దాని యున్నతి తారకాధ్వజము మిగులు
సులలితములైన కవుల యూహలక్నఁ దఱుగు

హిమగిరుల సౌందర్యాన్ని అద్భుతంగా వర్ణించిన జాషువా కైలాసగిరులలో శివుడి వైభవాన్ని విలాసంగా తెలియజేస్తారు.

కనులఁ జూచి రమ్ము కైలాస భూమి
వింతలెల్ల దెలుప వేళకాదు
నీకు శుభము గల్గు నిఖిలామరశ్రేణి
సరస్నుఁడమ్మ బాలచంద్ర ధర్నుఁడు

అంటూ శివుడి దర్శనం శుభాలను కలిగిస్తుందని తెలియ చెబుతాడు. అంతేకాక మన దేశంలోని సంస్కృతి, సంప్రదాయాలు, ఆదర్శ మూర్తులు తదితర అంశాలను సందర్భానుసారంగా ఉటంకించారు.

జాతీయ పౌరుష జ్వలన మా బాల్యంబు
సవరించు కావ్యరాజములులేక
విక్రమక్రమశిక్ష వెన్నతోనిడు జిజా
సతివంటి మాతృదేవతలు లేక
నొకజుట్టు నొకబొట్టు నొకకట్టుబడి నేర్పి
పాలింపజాలు దేవతలులేక
కులమెల్ల చెదరి తెంపులు తెంపులగుచుండ
వారించి కాపాడు ప్రభువులేక
బుద్బుదంబుల కొనయైన మూడునాళ్ళ
పదవులకు ప్రతిష్టలకునై ప్రాకులాడి
నరులనమ్మించుకొనలేక నమ్మలేక
చిదికియున్నవి మాజాతి జీవితములు

అంటూ ప్రాచీన సంప్రదాయాలు అడుగంటడం వల్లనే దేశంలో సామాజిక అసమానతలు పెరిగాయని తెలియజేశారు. దేశ నాయకులను సైతం గబ్బిలంలో సందర్భానుసారంగా కీర్తించడం కనిపిస్తుంది.

బహూదేశ మత మహాపరిషత్తు తలయూచ
పలికి వచ్చినది మా భరతసుత్నుఁడు
కండెబొట్టున నైదు ఖండాల నోడించి
కొలువులందినది మా కోమటన్న

అంటూ వివేకానందుని, గాంధీజీని, ఠాగూర్ ను తదితర దేశనాయకులను గురించి తెలియజేశారు. నిమ్న జాతి సముద్ధరణకు కోసం అహరహం శ్రమించిన అంబేద్కర్ ను గురించి ప్రస్తావించారు.

కలడంబెత్కరు నా సహోదరుడు మాకై యష్ట కష్టాలకుం
బలియై సీమకుపోయి, క్రమ్మిన విద్వాంసుడు వైస్రాయి మే
ల్కొలువందుంగల దోర్దవాదతడు నీకున్ స్వాగతబిచ్చి పూ
వుల పూజల పోనరిమ్చేనే యతని మెప్పుల్ నీజయారంభాముల్.

ఈ విధంగాగుర్రం జాషువా గారి కవిత్వంలో జాత్యభిమానం, దేశాభిమానం, భాషాభిమానం పెనవేసుకున్న దేశభక్తితో జాతికి కొత్తగా జవసత్వాలనందించాయి. జాషువా తన ఖండకావ్యం లో

"సింధు గంగానదీ పయః క్షీరమేపుదు
గురిసి బిడ్డల పోషించుకొనుచున్న
పచ్చి బాలేంతరాలు మా భరతమాత
మాతలకు మాత సకల సంపత్సమేత"

అంటూ భరతమాత ఔన్నత్యాన్ని మనసారా కీర్తించారు. మాతలకు మాత –సకల సంపత్సమేత మా భరత మాత' అంటూ జాషువా సగరుడు, మాంధాత మొదలైన షట్చక్రవర్తులను కన్నతల్లిగా, శ్రీకృష్ణుని వేణుగానామృతం లో మునిగితేలిన పవిత్ర మూర్తిగా, బుద్ధుడు మొదలైన మునీశ్వరులు ఎందరో తపస్సు చేసిన కర్మభూమి భరత జాతిని కీర్తించారు. జాతిని సమైక్య పరచడానికి నిరంతరం తపించిన నవ్య సాహిత్య వైతాళికుడు జాషువా. ఆనాటి జాతీయతా భావాలు, నిజమైనదేశభక్తి జాషువా కవిత్వంలో అణువణువునా దర్శనమిస్తాయి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న మన జాతీయ నాయకులకు ఊపిరిలూదిన దేశ భక్తి కవిత్వం ఇది.

రాజు చేతి కత్తి రక్తంబు వర్షించు
సుకవి చేతి కలము సుధలు గురియు

నిజమే! జాషువా కలం సుధలనే కురిపించింది. వేదనా భరిత మైన తన జీవిత సంద్రాన్ని మధించి అపురూపమైన కవితామృతాన్ని చిలికిన మహాకవి జాషువా.

రాజు జీవించు రాతి విగ్రహములందు
సుకవి జీవించు ప్రజల నాలుకల యందు

అన్న జాషువా మాటలు అక్షరాలా ఆయనకు వర్తిస్తాయి. తెలుగు సాహిత్యం ఉన్నంత కాలం జాషువా జీవించే ఉంటాడు.

డా. సాగర్ల సత్తయ్య
7989117415